# Update on Construction work in AIIMS, Bibinagar



# ఎయిమ్స్‌లో నిర్మాణ పనులు ముమ్మరం

బీబీనగర్, న్యూస్‌టుడే

తెలంగాణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు బీబీనగర్ ఎయిమ్స్ అడుగులు వేస్తోంది. 2023 ముగిసే నాటికి పూర్తిస్థాయి వైద్య సేవలందించడమే లక్ష్యంగా ఆసుపత్రిలో నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఎయిమ్స్ ప్రారంభమైనప్పటి నుంచి ఓపీ సేవలకే పరిమితం కాగా గడిచిన మూడు నెలల్లో ఇన్‌పేషెంట్ సేవలకు ఆదరణ పెరిగింది. ప్రస్తుతం 100 పడకలతో సాధారణ (జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్స్, ఆప్తమాలజీ, గైనకాలజీ, ఫ్యామిలీ మెడిసిన్, ఈఎన్‌టీ, జనరల్ సర్జరీ), 30 పడకలతో ఐసీయూ సేవలు కొనసాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం బీబీనగర్ ఎయిమ్స్‌కు రూ.1028 కోట్లు మంజూరు చేయగా నిర్మాణ పనులకు రూ.800 కోట్లు, వైద్య పరికరాల కొనుగోలుకు రూ.183 కోట్లు, మిగతా రూ.45 కోట్లు ఆసుపత్రి అభివృద్ధి పనులకు కేటాయించారు.

బీబీనగర్ ఎయిమ్స్‌లో ఓపీ సేవలకు వేచి ఉన్న రోగులు

## ఊపందుకుంటున్న వైద్య సేవలు..

బీబీనగర్ ఎయిమ్స్‌లో జూన్ 2, 2020న ఓపీ సేవలు ప్రారంభమయ్యాయి. కొవిడ్ సమయంలో రోగులకు వైద్య సేవలందించాలని ఎయిమ్స్ ఆధ్వర్యంలో టెలీకన్సల్టేషన్, ఆ తర్వాత వీడియో కన్సల్టేషన్ ఏర్పాటు చేశారు. అయినా సరైన ఫలితం లేకపోవడంతో ఎయిమ్స్ డైరెక్టర్ భాటియా ఆధ్వర్యంలో వైద్యులు ఓపీ సేవలపై ప్రత్యేక దృష్టిసారించారు. క్రమేణా రోగుల తాకిడి పెరిగింది. ప్రస్తుతం రోజుకు 600 మంది వరకు రోగులు చికిత్స చేయించుకుంటున్నారు. 2021 జులై 14న ఇన్‌పేషెంట్ సేవలు ప్రారంభించినా ఈఏడాది మార్చి వరకు కొంతమందే సేవలు వినియోగించుకున్నారు. ప్రస్తుతం రోజూ 50 మంది వరకు ఇన్‌పేషెంట్ సేవలు వినియోగించుకుంటున్నారు.

## పీడియాట్రిక్ సేవలకు ఆదరణ

ఎయిమ్స్‌లో నవజాత శిశువులకు పీఐసీయూ ఏర్పాటుచేసి నాలుగు రేడియంట్ వార్మర్‌లు, సీపీఏపీ పరికరాలు అందుబాటులో ఉంచారు. చాలామంది పీడియాట్రిక్ సేవలకు ఎయిమ్స్‌ను ఆశ్రయిస్తున్నారు. ఎయిమ్స్ దత్తత తీసుకున్న బొమ్మలరామారం పీహెచ్‌సీలో నెలకు రెండుసార్లు వైద్య శిబిరాలు ఏర్పాటుచేస్తుండడంతో అక్కడా సేవలకు స్పందన వస్తోంది.

మరిన్ని జిల్లా వార్తలు 5, 6, 8 పేజీల్లో...

## 2023లో పూర్తిస్థాయిలో వైద్య సేవలు

డాక్టర్ వికాస్ భాటియా, ఎయిమ్స్ డైరెక్టర్

కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ అధికారుల చొరవతో ఎయిమ్స్ నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. 2023 నవంబర్ నాటికి అన్ని రకాల వైద్య సేవలందించే దిశగా పనిచేస్తున్నాం. అందుకు కావాల్సిన వైద్యులు, సిబ్బంది నియామకం దాదాపు పూర్తయ్యింది. బొమ్మలరామారంలో పదెకరాల్లో రూరల్ హెల్త్ కేర్ సెంటర్ ఏర్పాటు ప్రక్రియ సాగుతోంది.

## ఓపిగ్గా చూస్తున్నారు

– సత్తిరెడ్డి, హుజూరాబాద్

నా ఎడమ కాలుకు గాయమైంది. ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేసి కొంతమేర కాలు తీసేశారు. మధుమేహ బాధితుడిని కావటంతో గాయం తగ్గడం లేదు. ఆసుపత్రికి వెళ్లిన ప్రతిసారి రూ.10వేల వరకు ఖర్చవుతుంది. మా బంధువుల సూచన మేరకు బీబీనగర్ ఎయిమ్స్‌కు వచ్చాను. ఇక్కడి వైద్యులు రెండు రోజులు ఆసుపత్రిలో చేర్పించుకొని చికిత్స అందించారు. ఓపిగ్గా చూస్తున్నారు. దారి ఖర్చులతో సహా రూ.2 వేలకు మించి అవడం లేదు.

*Source: Eenadu Dated: 07-10-2022*